## దీపావళి సంబరాలు - by SKU

Back Home

ఈ వారం దీపావళి ని మా కంపెనీ ప్రెసిడెంట్ వాళ్ళింట్లో మా కంపెనీ లో వున్న సాటి భారతీయులు అంతా కలిసి చేసుకుందాం అని చెప్పారు. టొరొంటో లో వుండగా ప్రతీ దీపావళి నీ ఒకో రకంగా జరుపుకున్నాను. మొదటి దీపావళి ని Air Canada Centre లో బ్రహ్మాండమైన ఇండియన్ ధమాకా తో చేసుకున్నాం. దీనికి అప్పటి Miss India కూడా వచ్చినట్టు గుర్తు! తరువాతి దీపావళి ఫ్రెండ్స్ తో పోట్ లాక్ లాగ చేసుకున్నాం. అప్పటికి ఇక్కడ Bulk Ban లో దీపావళి టపాసులు దొరుకుతాయని తెలిసిపోయింది. కనుక, దీపావళి ఊసు రాగానే అరమోడ్పు కన్నులతో "ఇండియా లో అయితే అవి కాల్చుకునేవాళ్ళం.. ఇవి కాల్చుకునేవాళ్ళం" టైపు కబుర్లు చెప్పటం తగ్గింది. ఎందుకంటే, మనసుంటే ఇక్కడ కూడా కాల్చుకోవచ్చు అని తెలిసింది కనుక! క్రిందటి దీపావళి ఏమీ చేయలేదు కానీ ఆ ముందటి దీపావళి కి అప్పటి మా ఇంటాయన ఒక పంజాబీ ఆయన. దీపావళి కి వాళ్ళ గురుద్వారా లో హిందువులు అంతా చేరి టపాసులు కాల్చుకుంటారు చాలా బాగుంటుంది అని వాళ్ళ కుటుంబం తో పాటు నన్ను కూడా లాక్కుపోయారు. ఇంక ఈ సంవత్సరం.. ఈ పార్టీ కి వచ్చే వాళ్ళు ఎవరెవరో తెలీదు. కొత్తగా చేరిన ఉద్యోగం, ఇంకా ఎవరికి పెళ్ళిళ్ళు అయ్యాయో ఎవరు ఒంటి పిల్లి శొంఠి కొమ్ము లో తెలీదు. ఆ వివరాలు అన్నీ తెలుసుకొనే తీరిక ఇంతవరకూ దొరకలేదు. ఈ సామూహిక దీపావళి జరుపుకోవటం పుణ్యమా అని అందరూ తెలుస్తారు లెమ్మని, సరే వస్తా అని చెప్పాను.

ఇంక పండగ అంటే, చిన్నప్పుడు అయితే, మాకు ఎంతసేపు ఎలా నాన్నగారికి మస్కా కొట్టి అమ్మ మా బట్టల బడ్జెట్ పెంచేలా చెయ్యాలీ, ఏ డిజైన్ బట్టలు కొనుక్కోవాలి, అవి ఎంత తొందరగా తొడిగెయ్యాలీ.. ఇదే ధ్యాస.

మాది మధ్య తరగతి కుటుంబం, అందులో ముగ్గురు ఆడపిల్లల తండ్రి.. కనుక ఆ బాధ్యత నాన్నగారినీ మరింత జాగర్తపరుడిగా చేసింది. అందుకే, సాధ్యమైనంత వరకూ "ఈ దీపావళి టపాకాయల మీద డబ్బు తగలెయ్యటం (ఆయన ఉపయోగించే విశేషణం) దండగ" అనేవారు. కొంచెం ఊహ తెలిసాక ఆయన తో బేరాలాడేవాళ్ళం టపాకాయలు కాల్చము, ఆ డబ్బులు మాకిచ్చేయండి అని. ఇప్పుడు తలచుకుంటే ఒకోసారి ఆ పద్ధతి మెటీరియలిస్టిక్ గా అనిపిస్తుంది కానీ, నాన్న గారి పరిస్థితి లో నేను వుండి వుంటే, ఆయన లాజిక్ ని అర్థం చేసుకోగలను.

కాల్చుకునే రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకూ టపాకాయలు ఇంట్లో అంతా కలిసికట్టు గా కుటీర పరిశ్రమ టైపులో పని చేసి తయారు చేసేవాళ్ళం. ముందు మతాబాలకి మైదా పిండి ఉడికించి చేసిన జిగురు తో గొట్టాలు తయారు చేసి, వాటిని ఒక రోజంతా ఆరబెట్టి, మర్నాడు మతాబాలు చేసేవాళ్ళం. మతాబాలు చేయటానికి చిన్న పిల్లలం మా పని, పెరట్లో పొడి ఇసుక సేకరించటం. దీపావళి టైము లో వర్షాలు పడి పొడి ఇసుక దొరక్క పోతే, ఆ తడి ఇసుక ని ఎండలో ఆరబెట్టి దానిని పొడి గా చేసే బాధ్యత మాదే! తరువాత మా ఇంట్లో ఒక కర్ర వుండేది. దాని లెక్క తో గొట్టాలు చుట్టేవాళ్ళు. ఆ కర్ర మీద ఒక మార్క్ వుండేది. ఆ లెక్క వరకూ ఈ పేపరు గొట్టాలలో పొడి ఇసుక నిపటం తో పిల్లల పని పూర్తి అయేది.

ఇంక మిగిలిన పని అమ్మ, నాన్నగార్లది. మిక్చర్ కలపటం పని నాన్నగారిది. అది కలుపుతుండగా, మమ్మల్ని ఆ గది లోకి కూడా రానిచ్చేవారు కాదు. ఆ గాలి పీల్చి ఉక్కిరి బిక్కిరి అవుతామని! అలా వాళ్ళిద్దరే మతాబాలు అన్నీ చుట్టి చివర మూసి మూడు ట్రే లలో పెట్టేవారు. మా ముగ్గరికీ ఎవరి ట్రే వాళ్ళది వుండేది. వాటిని నాన్నగారి పర్యవేక్షణ లో మేము కానీ, లేకపోతే నాన్నగారు కానీ దీపావళి కి ముందు 5, 6 రోజులు ఎండలో పెట్టేవాళ్ళం. ఎంత బాగా ఎండితే అంత బాగా మండుతాయి అనేవారు నాన్న గారు.

మా ఇంట్లో మా నోనీ, అమ్మమ్మ ఇద్దరికీ ఆ శబ్దాలు పడేవి కావు. కనుక నోనీ మా చివర గదిలో నాన్న గారు వాళ్ళ మంచం కింద మధ లో ఎవరికీ అందకుండా కూర్చుని భయం తో అరచేది. మా అమ్మమ్మ అయితే చెవిలో దూది పెట్టుకొని, గుమ్మం లో కూర్చుని చూసేది. నాన్నగారు లక్ష్మి టపాకాయలు ఇంట్లో చిల్లు పడిపోయినా పడేయని ఇనప బాల్చీ మూత పెట్టి కాల్చేవారు. అలా బాల్చీ మూత పెడితే, ఒక కొత్త ధ్వని వచ్చేది. ప్లస్, ఆ బాంబులు చెల్లాచెదురు అయేవి కావు.

మధ్యాహ్నం నాలుగు గంటలకే మా స్కూటర్ నీ, తన స్కూటర్ నీ తీసి ఇంట్లో పెట్టేసేవారు. టెర్లీన్ బట్టలు అయితే, ఏదన్నా నిప్పు రవ్వ పట్టుకుంటే ప్రమాదం అని పాత కాటన్ బట్టలు కట్టుకొని తయారయ్యేవాళ్ళం కాల్చుకునే టైముకి.

నాకు మతాబాలు, తాటాకు టపాకాయలూ, కాకరపువ్వొత్తులూ, చిచ్చుబుడ్లూ ఇష్టం. తారాజువ్వలు నాన్నగారు చూడకుండా ఇంట్లోకి స్మగుల్ చేసినవి బాటిల్ లో నిలబెట్టి కాల్చేవాళ్ళం. తారాజువ్వలు ఆయన కాల్చేవారు కాదు, మమ్మల్ని కాల్చనిచ్చేవారు కారు. మా పాలబ్బాయి వాళ్ళ అబ్బాయి దగ్గర ఆయన వెనుక నేర్చుకున్నాం మేము :)

ఈ సంవత్సరం దీపావళి కి మా ఇంట్లో నెలల వయసున్న చంటి పిల్ల వుంది. అమ్మమ్మ పోయింది, సోనీ పోయింది, మా సుజీ తప్ప మేమెవ్వరమూ లేము. ఇంట్లో వాళ్ళకి పండగ చేసుకునే ఉత్సాహం లేదు. . ఇల్లంతా బోసిగా వుందిట. ఊర్లో కొత్తగా వచ్చిన కలెక్టరు గారు కూడ శబ్ద కాలుష్యం గురించి అందర్నీ ఎడ్యుకేట్ చేస్తున్నారుట అమ్మ ఈ విషయాలన్నీ చెప్తోంటే.. పండగ కేవలం ఇంక ఒంట్లో ఓపిక వుంటే వంటకాలు చేసుకు తినటం వరకే పరిమితమైంది అనుకున్నాను.

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.